క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కందూర్లు

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో మహబూబ్ సుభాని కందూర్ల పండుగ సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన బంధువులు రాకతో గ్రామంలో పండుగ వాతావరణం కనబడింది. ప్రతి ఇంటిలో కందూరు చేసి మహబూబ్‌సుభాని దర్గాలో ఫాతేలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు

మహబూబ్ సుభాని ఉర్సు (గ్యార్మీ) మహోత్సవంలో భాగంగా దర్గాలో ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశబూరు. పాడి పంటలు సమృద్ధి పండి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన ఎండీ జైనుల్లాకు స్మార్ట్ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు 15 అక్టోబర్ 2024 న పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించి ఫోన్‌ను స్వాధీనం చేసుకొని సోమవారం అప్పగించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో పీసీ మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానాలు అధిరోహించాలి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో జేఎస్ఆర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 5వ తరగతిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుడు సీఏ అనిల్, జే అనిల్ సహకారంతో నిర్వహిస్తున్నారు. కోచింగ్ సెంటర్‌కు వచ్చిన విద్యార్థులకు జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. గురుకులాల్లో సీటు సాధించేందుకు ఇస్తున్న కోచింగ్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, గురుకులాల్లో చదువుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజు, అమృతరాజు, మహిమరాజు, దయానందరాజు, కర్ణ కుమార్, మోహన్, కళ్యాణ్ ఉన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్ష



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్‌బీఎస్‌కే వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు డాక్టర్ రఘు, డాక్టర్ స్వప్న, లక్ష్మి అన్నారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. రక్తం తక్కువగా ఉన్న విద్యార్థులకు అవసరమైన మందులు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఫార్మసిస్టు శ్రీవిద్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐహెచ్ఆర్ రాష్ట్ర కార్యదర్శిగా జీటీ శ్యామ్

వనపర్తి టౌన్: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన జీటీ శ్యామ్ నిమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో జీటీ శ్యామ్‌ను నియమిస్తూ జాతీయ చైర్మన్ డాక్టర్ నిమ్మన్ ప్రేమ్‌వరల్డ్, సౌత్ ఇండియన్ చైర్మన్ రాజేష్ చేతుల మీదుగా నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ ప్రజల ప్రాథమిక సమానత్వ హక్కులకు భంగం కలుకుండా హ్యూమన్ రైట్స్ నుంచి పోరాటం చేస్తమన్నారు.

నిబంధనలు పాటించాలి

వనపర్తి టౌన్: మున్సిపల్ పరిధిలోని గృహ నిర్మాణాలు, లే అవుట్లు వేసే క్రమంలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని టీపీఎస్ యమున అన్నారు. సోమవారం పుర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవడం ద్వారా గృహ యజమానులకు, ప్లాట్లు కొన్నవారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీలో టీపీఎస్‌గా పనిచేస్తున్న ఆమె బదిలీపై వనపర్తిలో బాధ్యతలు చేపట్టారు. యమున రాకతో వనపర్తికి ఇద్దరు టీపీఎస్‌లు విధుల్లో కొనసాగనున్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అదనపు కార్యదర్శిగా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన బాదం వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో జిల్లాకు చెందిన ఆర్యవైశ్యులు సమావేశమై జిల్లా ఆర్యవైశ్య మహాసభ అదనపు కార్యదర్శిగా తనను ఎంపిక చేయడంపై ఆయన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాదం మాట్లాడుతూ రాబోయే రెండేళ్లలో జిల్లా ఆర్యవైశ్య సంఘాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పట్టణంలోని పలువురు రాజకీయ నాయకులు బాదం వెంకటేష్‌ను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

పాన్‌గల్: ప్రతి పాఠశాలల్లో విద్యార్థుల అపార్ ఐడీ వివరాలను త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు హెచ్‌ఎంలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి అపార్ ఐడీ వివరాలు (శాశ్వత ఆధార్) త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ కొన్ని పాఠశాలల్లో వివరాలు సేకరణ ప్రారంభించని వారు త్వరగా ఐడీని జనరేషన్ చేసి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. అపార్ ఐడీ జనరేషన్ విషయంలో హెచ్‌ఎంలకు ఉన్న సందేహాలను డేటా ఎంట్రీ ఆపరేటర్ మూర్తి అవగాహన కల్పించారు. ప్రతి రోజు ఉదయం ప్రార్థన సమయంలో జీపీఎస్ ద్వారా ఫోటో తీసి ఉపాధ్యాయ సిబ్బంది యొక్క హాజరును నమోదు చేయాలన్నారు. బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించుటకు కృషి చేయాలని సూచించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

ఇటీవల జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సోషల్ సబ్జెక్టు టాలెంట్ టెస్టులో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు, సబ్జెక్టు టీచర్లకు సమావేశంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని పూజ, ఉపాధ్యాయుడు శ్రవణ్ కుమార్, పాన్‌గల్ ఉన్నత పాఠశాల విద్యార్థి లక్ష్మి, ఉపాధ్యాయుడు అక్బర్‌పాషు, బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి సురేష్, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు ను సన్మానించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులు, సబ్జెక్టు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఎమ్మార్సీ సిబ్బంది



తూంకుంటలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింహులు

పాన్‌గల్: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'పిల్లలు బడిలో–పెద్దలు పనిలో' కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బడిబయట పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. బడిబయట ఉన్న 8వ తరగతి విద్యార్థి సాయిచరణ్‌ను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి బాలుడిని బడిలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్‌యాదవ్, సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి పాల్గొన్నారు.

బడిలో చేర్పించేందుకు సహకరించాలి

వీపనగండ్ల: బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం తల్లిదండ్రులు బాధ్యతగా భావించాలని మండల విద్యాధికారి నర్సింహులు అన్నారు. బడి బయటి పిల్లల సర్వేలో భాగంగా సోమవారం తూంకుంటలో ఇంటింటి సర్వే నిర్వహించారు. విద్యార్థులు పాఠశాలలు మానిపించి పనులకు తీసుకెళ్తే వారి హక్కులను హరించినవారం అవుతామని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ఈ నెల 25 తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో బడి బయటి పిల్లలపై ఇంటింటి సర్వే కార్యక్రమం కొనసాగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సీఆర్పీ వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై జిల్లా వ్యాప్తంగా 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహిస్తారని అధికారులు వెల్లడించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులను గ్రామ సభలోనే ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. గ్రామస్తులు, నాయకులు, అర్హులు విధిగా గ్రామసభలకు హాజరు కావాలని వారు కోరారు.

- పెద్దమందడి మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారుల సమక్షంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సద్గుణ తెలిపారు. గ్రామసభలో గ్రామపంచాయతీ కార్యదర్శితో పాటు గ్రామానికి కేటాయించిన ప్రత్యేక అధికారి కూడా పాల్గొంటారన్నారు.
- వనపర్తి మండలంలో 21న అచ్యుతాపురం, అంజనగిరి, గుంతతండా, పడమటితండా, పెద్దతండా (డి), కడుకుంట్ల, అప్పాయిపల్లి, చిమనగుంటపల్లి, చిట్యాల, నాచహళ్లి, 22న పెద్దతండా (ఆర్), సవాయిగుడెం, నాగమ్మతండా, కీర్యాతండా, తూర్పుతండా, కందిరీయతండా, కిష్టగిరి, మెంటిపల్లి, 23న అంకూర్, చందాపూర్, కాశీంనగర్, రాజపేట్, వెంకటాపురం, 24న దత్తాయిపల్లి, పెద్దగూడెం, పెద్దగూడెంతండాలో గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ రాఘవ తెలిపారు.
- వీపనగండ్ల మండలంలో మంగళవారం ఉదయం బొల్లారం, వీపనగండ్ల, నాగర్లబండతండా, రంగవరం, మధ్యాహ్నం నుంచి కొర్లకుంట, సంపత్‌రావుపల్లి, గోపల్‌దిన్నె గ్రామాలు, 22న వల్లభాపురం, తూంకుంట, గోవర్ధనగిరి, నాగర్లబండ తండా, కల్వరాల, 23న పుల్గర్‌చర్ల, సంగినేనిపల్లిలో గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా హాజీమాలంగ్ బాబా ఉర్సు



అమరచింత: మండలంలోని మస్తీపురం గుట్టలపై వెలిసిన శ్రీసయ్యద్ షా హాజీమాలంగ్ బాబా దర్గా ఉరోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉర్సు సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులు కొబ్బరికాయలు, మలీజను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పొట్టేళ్లను బలిచ్చి కందూర్లు చేశారు. ఉర్సుకు మండలంలో ప్రజలే కాకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం జారతే ఫాతేహాతో ఉర్సు ముగుస్తుందని ముర్షద్ మైనోద్దిన్ తెలిపారు.

'డీబీసీడబ్ల్యూఓ జిల్లా అధికారిని సస్పెండ్ చేయాలి'

వనపర్తి విద్యావిభాగం: డీబీసీడబ్ల్యూఓ జిల్లా అధికారి బీరం సుబ్బారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కె.పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పీడీఎస్‌యూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పవన్‌కుమార్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో బీరం సుబ్బారెడ్డి హెచ్‌డబ్ల్యూఓగా కొండనాగుల హాస్టల్‌లో 2016 సంవత్సరం ఉద్యోగంలో ఉన్నప్పుడు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసు పెండింగ్‌లో ఉండగా వనపర్తి జిల్లాకు ఏబీసీడబ్ల్యూఓగా బదిలీపై వచ్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు తయానా, ప్రవీణ్, రాజు, గణేష్, రాజశేఖర్, రాఘవేందర్ ఉన్నారు.

జాతీయస్థాయి హాకీ టోర్నీకి నీలావతి

ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంటతండా స్టేజీ సమీపంలో ఉన్న తెలంగాణ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, పీడీ చందర్ తెలిపారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ హాకీ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో నీలావతి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికై ందన్నారు. ఈ నెల 27న జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయస్థాయి టోర్నీలో విద్యార్థిని రాష్ట్రం తరఫున పాల్గొంటుందని తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికై న నీలావతిని ప్రిన్సిపాల్, పీడీతో పాటుగా పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



విద్యార్థిని నీలావతి అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

గోపాల్‌పేట: మద్యం తాగి ద్విచక్రవాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ హెచ్చరించారు. ఇటీవల మద్యం తాగి పట్టుబడిన ఇద్దరికి సోమవారం జైలుశిక్ష పడిందన్నారు. ఏదుట్లకు చెందిన మౌలాలి, కేశంపేటకు చెందిన బంకల వెంకటేష్ మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతూ పట్టుబడగా.. వనపర్తి కోర్టులో హాజరుపర్చామన్నారు. వివరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఒకరికి మూడు రోజులు, మరొకరికి ఆరు రోజులు జైలుశిక్ష విధించారని తెలిపారు.

సర్వే పరిశీలన

పాన్‌గల్: సంక్షేమ పథకాల అమలు కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు పాన్‌గల్‌లో సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, ఆర్‌ఐ మహేష్, ఏఈఓ అఖిల, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల జెడ్పీహెచ్ఎస్‌కు గ్రామానికి చెందిన సురేంద్రచారి సొంత డబ్బులతో కొనుగోలు చేసిన ఐదు కుర్చీలను అందజేశారు. కుర్చీలు అందించిన సురేంద్రచారికి పాఠశాల ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



అమరచింత: రహదారి భద్రత నియమాలు వాహనదారులు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ప్రమాద బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్‌ను తప్పకుండా ధరించాలని కోరారు. కారు డ్రైవింగ్ చేస్తున్న సమయంలో సీట్ బెల్ట్ పెట్టుకోవడం వల్ల ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ఇచ్చిన యాజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పుర కార్మికులకు అత్యవసర కిట్లు

వనపర్తి టౌన్: స్థానిక పురపాలికలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అత్యవసర విధుల్లో, ఆపత్కాలంలో రక్షణగా ఉండేందుకు ఐదు జతల అత్యవసర కిట్లను రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు వనపర్తి మున్సిపాలిటీకి పంపించారు. ఎఫ్ఎస్‌టీ ప్లాంట్‌ను శుభ్రం చేసే సమయంలో రక్షణగా ఉండే దుస్తులు, తలకు గాయాలు కాకుండా పెద్ద డ్రెయినేజీల్లో ఇతరత్రా పనుల్లో నిమగ్నమైనప్పుడు హెల్మెట్ తరహాలో టోపి, ముఖానికి రక్షణగా మాస్క్ పంపించడంతో సోమవారం వాటిని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి జవాన్లకు అందించారు.



అత్యవసర కిట్లను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

పాన్‌గల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నది సీపీఐ అని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ బలపర్చిన అభ్యర్థులకు మద్దతు ప్రకటించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బూర్జువా పార్టీల అభ్యర్థులను గెలిపిస్తే పదవులను అడ్డుపెట్టుకొని తమ స్వలాభం చూసుకుంటారన్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసే గ్రామసభలల్లో పార్టీ నాయకులు పాల్గొని అర్హులైన పేదల గురించి అధికారులకు వివరించి న్యాయం చేయాలన్నారు.కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కాకంబాలస్వామి, సహదేవ్, రాముడు, పరందాములు, కట్టెల బాలస్వామి, ఎర్రగుంటరాముడు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న శ్రీరామ్

అపార్ నమోదుపై అవగాహన

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సోమవారం ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(ఆపార్) నమోదుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ అపార్ ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఐడీ నమోదులో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాల గూర్చి ఆయన వివరించారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుపై హర్షం

ఆత్మకూర్: మండల కేంద్రానికి డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేసి ఇక్కడి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, రహ్మతుల్లా కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మండల స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకులు డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతూ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం జరిగే 50 పడకల ఆస్పత్రి భవనం నిర్మాణానికి భూమిపూజకు రావాల్సిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ పర్యటన అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు తెలిపారు. త్వరలోనే మంత్రి పర్యటన వివరాలు తెలియజేస్తామన్నారు. అదేవిధంగా 26 నుంచి ప్రారంభమయ్యే 4 సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమనికి సంబంధించి మంగళవారం నుంచి జరిగే గ్రామసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో తులసీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పీహెచ్‌సీలోనే మెరుగైన వైద్యం

పాన్‌గల్: గ్రామాల్లో ఉండే ప్రతి గర్భిణి పేరు నమోదు చేసి వారికి మెరుగైన వైద్యం అందించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ) రామయ్య అన్నారు. సోమవారం మండలంలోని కేతేపల్లిలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని, వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం, వ్యాయామం చేయాలన్నారు. పీహెచ్‌సీలో కాన్పులు చేయించుకుంటే ప్రభుత్వం అందించే ప్రోత్సాహం గురించి వివరించారు. 102 వాహనం, అంబులెన్స్‌ను వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుమనశ్రీ, హెల్త్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు సంధ్య, చిన్నమ్మ, కవిత, ప్రమీల పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ రామయ్య, వైద్య సిబ్బంది

నిందితులను శిక్షించాలని ఉపాధ్యాయుల నిరసన



పాన్‌గల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్/పాన్‌గల్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై కొందరు వ్యక్తులు చేసిన దాడిని ఖండిస్తూ సోమవారం పెద్దమందడి మండలం మోజర్ల, మద్దిగట్ల జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు, ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎంల అధ్యక్షుడు వరప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడిపై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

⇨ పాన్‌గల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాలయాలు కుల, మతాలకతీతంగా కొనసాగాలని, విద్యను అభ్యసించే పిల్లల మనసులో ఎలాంటి పక్షపాత వైఖరి లేకుండా చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి కొలమానమన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లిలో ఆదివారం మూలె నర్సింహపై అదే గ్రామానికి చెందిన బోడ అంజి దాడి చేసి గాయపరిచారని బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు దాడి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. అప్పు ఇచ్చిన డబ్బులు వసూలు చేసుకునే క్రమంలో దాడికి పాల్పడినట్లు తెలుస్తుందని, పూర్తి విచారణ చేసి నిందితుడిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారురు.

నిందితుడిని శిక్షించాలి

మండలంలోని సంగినేనిపల్లిలో దళితుడు మూలె నర్సింహపై అదే గ్రామానికి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో మాలల చైతన్య సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. గ్రామానికి చెందిన బోడ అంజి, వెంకటోరెడ్డి, శివుడు కలిసి మూలె నర్సింహపై రాయితో దాడి చేసి గాయపరిచారని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు అవుట శ్రీను, నాగరాజు, భరత్, రాజు, విష్ణు, నర్సింహ పాల్గొన్నారు.



దాడిలో గాయపడిన మూలె నర్సింహ

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఆత్మకూర్/వీపనగండ్ల: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు మహమూద్ ఆత్మకూర్, వీపనగండ్ల మండల కార్యదర్శులు ఎస్.రాజు, బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సీపీఎం అన్నారు. కార్మిక, కర్షకుల సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై రాజీ లేని పోరాటాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భారతీయుడు, మునెప్ప, మురళి, సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, బాలస్వామి, వెంకటేష్‌గౌడ్, శ్రీను, రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.



వీపనగండ్లలో వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యమిస్తాం

ఖిల్లాఘనపురం: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిర్వహించే వెయ్యి గొంతుకలు–లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల జిల్లా కమిటీ అధ్యక్షులు మొల్గర కుర్మయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా మిద్దె అంజనేయులు, ఎం.కేశవులు, మండల అధ్యక్షుడిగా మల్లగల్ల మన్యం, ఉపాధ్యక్షుడిగా కోటి మన్యం, ప్రధాన కార్యదర్శిగా పానుగంటి నర్సింహులు, సహాయ కార్యదర్శిగా గుడ్లనర్వ నర్సింహులు, రమేష్, కమలయ్య, కోశాధికారిగా మల్లేష్ నియమించారు. కార్యక్రమంలో డప్పుకళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బెజినీ మహబూబ్, ప్రధాన కార్యదర్శి గడ్డం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

సాగుకు యోగ్యం కాని భూముల పరిశీలన

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మున్సిపల్ కేంద్రంలో పంట సాగుకు అనుకూలంగా లేని పంట భూములను పూర్తి స్థాయిలో పరిశీలిస్తున్నామని తహసీల్దార్ రవికుమార్, ఏఓ అరవింద్ తెలిపారు. మూడు రోజుల నుంచి మండలంలోని సాగుకు అనుకూలంగా ఉన్న పంటభూముల వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో ఉ న్న రికార్డుల ప్రకారం పరిశీంచినట్లు పేర్కొన్నారు. లే అవుట్లు చేసి స్థలాలను ప్లాట్లుగా మార్చి అమ్మ డం ద్వారా ఆ పొలం ఇంకా పంట పొలంగా రికార్డులో ఉందా లేదా అన్న విషయాలను ఫీల్డ్ విజిట్ చేసి అధ్యయనం చేస్తున్నామన్నారు. గ్రామసభల అనంతరం ప్రభుత్వ భూములతో పాటు సాగులో ఉన్న పొలాలు ఎన్ని, సాగుకు అనుకూలంగా లేని పొలాలు ఎన్ని అన్న విషయాలు పూర్తి స్థాయిలో రికార్డులో నమోదు చేస్తామని వెల్లడించారు.



పొలాలను పరిశీలిస్తున్న రెవెన్యూ, వ్యవసాయ అధికారులు